

ఇది కదా **అభివృద్ధి**

- 50వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాల నిర్మాణం
- లక్షల రూపాయలతో పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న నివాసులు

రక్షణ మార్గాలు



సాయిరాంనగర్ వద్ద కొండవాలు ప్రాంతంలో నిర్మించిన మెట్ల మార్గం



సత్యనగర్ కొండవాలులో రెయిలింగ్‌తోపాటు నిర్మించిన మెట్ల మార్గం

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు కొండవాలు ప్రాంతాల వాసుల దశాబ్దాల కల సాకారమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో కొండవాలులో మెట్ల మార్గాలు నిర్మించడంతో నివాసులు కష్టాలు తీరాయి. గతంలో కొండ మీద ఉన్న ఇంటికి చేరాలంటే గతుకుల దారే గతి. టీడీపీ ప్రభుత్వ హయాంలో స్థానికులు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా.. పట్టించుకున్న నాథుడే లేడు. వర్షం వచ్చిందంటే నడుచుకుని పైనుంచి కింది రోడ్డుకు రావాలంటే ఎక్కడ పడిపోతామోనని భయాందోళనలు వ్యక్తం చేసేవారు. ఇక మామూలు రోజుల్లో ఏ పని ఉన్నా కిందకి.. పైకి ఎక్కి దిగాలంటే కాళ్ల నొప్పులతో కాలం గడిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం వచ్చాక ఎన్నో మౌలిక వసతులను కల్పించి ప్రజల కష్టాలను తీర్చారు. దీంతో ఒక ప్రాంతంలో పదేళ్ల తరువాత.. మరో ప్రాంతంలో 19 ఏళ్ల తరువాత కొండవాలు నివాసుల ఇంటికి దారి ఏర్పడింది.

'గడప గడపకు మన ప్రభుత్వం'తో సమస్యలకు చెక్

జీవీఎంసీ 50వ వార్డు సత్యనగర్, సాయిరాంనగర్, సింగరాయమెట్ట కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాలు లేవని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజుకు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ద్వారా తెలియజేసి నేరుగా ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. వెనువెంటనే వారికి న్యాయం జరిగేలా జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పుడు కొండవాలు ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఎక్కి దిగడానికి వీలుగా మెట్ల మార్గాలు నిర్మించారు.

నిధులు.. పనులు

- **సత్యనగర్‌లో రెయిలింగ్‌తో మెట్లు, దానికి కన్వెడ్ రోడ్ల నిర్మాణానికి రూ.28 లక్షలు ఖర్చు చేశారు.** ఈ ప్రాంతంలో దాదాపు 40 కుటుంబాలు నివసిస్తున్నాయి.
- సాయిరాంనగర్‌లో మెట్లకు అటాచ్‌డ్ రోడ్లు, డ్రెయిన్లు కలిపి రూ.55 లక్షలతో నిర్మించారు. ఇక్కడ 30 కుటుంబాలు నివసిస్తున్నాయి.
- సత్యనగర్ కొండవాలు ప్రాంతంలో మెట్ల మీదుగా 5 సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు.
- సాయిరాంనగర్ మెట్ల మార్గంలో 2 సోలార్ లైట్ల పోల్స్‌ను ఏర్పాటు చేశారు.
- సాయిరాంనగర్‌లో సీసీ రోడ్లు ఎక్కడికక్కడ డబుల్ లేయర్‌తో వేశారు. కాలువలు నిర్మించారు.
- సింగరాయమెట్టలో మెట్లు, వాటికి సంబంధిత రోడ్లు, సపోర్టింగ్ సైడ్ వాల్స్‌కు సంబంధించి రూ.77.85 లక్షల నిధులతో నిర్మాణ పనులు మొదలు పెట్టారు.

కొండవాలు ప్రజల ఇబ్బందులు తొలగాయి



గత 19 ఏళ్ల నుంచి ఇంటికి చేరేందుకు సరైన మెట్లు, రోడ్లు లేక కాలనీ ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టీడీపీ హయాంలో వినతులు అందించినా న్యాయం జరగలేదు. ఇప్పుడు ఈ మెట్లు కట్టడం వల్ల ఇబ్బంది లేకుండా ఇంటికి చేరుతున్నాం. మెట్ల మార్గంలో సోలార్ లైట్ల ఏర్పాటుతో చీకటి కూడా తొలగింది. రోడ్లు, కాలువల నిర్మాణంతో సాయిరాంనగర్ కొండవాలు ప్రజలు ఆనందంగా ఉన్నారు.

– రాంబాబు, సాయిరాంనగర్



సింగరాయమెట్ట ప్రాంతంలో జరుగుతున్న మెట్ల నిర్మాణ పనులు

ప్రభుత్వం తక్షణం స్పందిస్తోంది



మా ప్రాంతంలో మెట్ల మార్గం కోసం 10 ఏళ్లుగా వేచి చూశాం. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజుకు వినతిపత్రం అందించాం. వెంటనే ఆయన స్పందించి చర్యలు తీసుకోవడంతో అధికారులు మెట్ల మార్గం నిర్మించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తక్షణం సమస్యలు పరిష్కరిస్తోంది.

–వేణుగోపాలస్వామి, సత్యనగర్

క్లుప్తంగా

రూ.19 లక్షలతో దోబీఖానా నిర్మాణం



జగన్నాథపురంలో శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు జగన్నాథపురంలోని శ్మశానవాటిక వద్ద శిథిలావస్థలో ఉన్న దోబీఖానా షెడ్డు తొలగించి రూ.19 లక్షల వ్యయంతో కొత్తగా దోబీఖానా నిర్మించనున్నారు. గురువారం కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా దోబీఖానా, పై అంతస్తులో కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్టు తెలిపారు. దీనికోసం రూ.19 లక్షల నిధులు మంజూరైనట్టు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో బుల్లయ్య కళాశాలకు పతకాలు

సీతంపేట: ఈ నెల 12, 13 తేదీల్లో ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన అంతర కళాశాలల పురుషులు, మహిళల అథ్లెటిక్స్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో పతకాలు సాధించారు. మహిళా అథ్లెట్లు 800, 1500, 5000 మీటర్లు, రిలే, 21 కిలోమీటర్ల మారథాన్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ ఆఫ్ రన్నర్ అప్‌గా నిలిచారు. పురుషుల జట్టు జావెలిన్, డెకథ్లాన్, రిలే, లాంగ్‌జంప్, హైజంప్ విభాగాల్లో బంగారు, రజత, కాంస్య పతకాలు పొందారు. ఈ సందర్భంగా గురువారం విజేతలను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



స్టాల్ టోకెన్ ఇస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు ఆధ్వర్యంలో గురువారం స్టాళ్లకు డ్రా తీశారు. వాటి టోకెన్లను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 66 మంది రైతులకు సంబంధించి స్టాళ్లకు డ్రా తీసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు కె.సతీష్, రైతులు పాల్గొన్నారు.

'గ్రీవెన్స్'తో సమస్యల పరిష్కారం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందించారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్నింటిని తక్షణం పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కులం, కట్నం పేరుతో వేధింపులు

మద్రిపాలెం: తన భర్త, అతడి కుటుంబ సభ్యులు కలిసి కులం పేరుతో దూషిస్తున్నారని ఓ వివాహిత కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాలిలా.. తాటిచెట్లపాలెం రైల్వే క్వార్టర్స్‌లో ఉంటున్న బంగారమ్మ ఆమె భర్త భానుచంద్ర కొన్నేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. కొంతకాలం వరకు బాగానే ఉన్నారు. ఇటీవల కాలంలో వారిద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. కులం పేరుతో భర్త, అతడి కుటుంబ సభ్యులు తరచూ దూషించడం, కట్నం కోసం వేధించడం చేస్తున్నారు. ఈ వేధింపులు తట్టుకోలేక ఆమె గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో 11 కేవీ టీపీటీ కాలనీ, 11 కేవీ వుడా కాంప్లెక్స్ ఫీడర్స్ పరిధిలో మరమ్మతులు, చెట్టు కొమ్మల ట్రిమ్మింగ్ నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు గణేష్‌బాబు హాస్పిటల్, బీఎం లా కళాశాల, బృందావన్ పార్కు, ఎస్‌ఎఫ్‌ఎఫ్ స్కూల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మద్రిపాలెం సెక్షన్‌లో..

మురళీనగర్: జోన్–2 డివిజన్ మద్రిపాలెం సెక్షన్ పరిధి కప్పరాడ 11 కేవీ ఫీడర్‌లో పాంథర్ కండక్టర్ స్థానంలో ఏఎల్ 59 జీబ్రా కండక్టర్ ఏర్పాటు పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాంజీ ఎస్టేట్, బాపూజీనగర్, కప్పరాడ, అప్పర్ జయప్రకాష్‌నగర్, జయప్రకాష్‌నగర్, సురేష్‌నగర్, జగ్జీవన్ నగర్, అంబేడ్కర్ నగర్, పెదకొత్తూరు, అరుంధతీ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

జగనన్నతోనే అభివృద్ధి



పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. 289 సచివాలయం కన్వీనర్‌గా ఉన్న ఆయన ఆయా సచివాలయం పరిధిలోని కళింగనగర్‌లో గురువారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల బ్రోచర్‌ను నివాసులకు అందించారు. వలంటీర్లు యమున, విజయ, యశ్వంత్, కుమారి, పార్టీ కార్యకర్త గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి లలితా పీఠంలో ధనుర్మాసోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మన్నవ కృష్ణసేన్

సీతంపేట: లలితానగర్‌లో లలితా పీఠంలో ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస వ్రత మహోత్సవం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాస వ్రతంలో భాగంగా కల్యాణ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రతి రోజూ నిత్య కైంకర్యం, విశేష సేవలు ఉంటాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 4 గంటలకు సుప్రభాతం, స్వామి, అమ్మవార్లకు అర్చన, బాలభోగ నివేదన, శాతుపాశురాల విన్నపం, గోదా చతుశ్లోకి జరుగుతాయని తెలిపారు. 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, జనవరి 3న సహస్ర దీపాలంకరణ, 11న కూడారై ఉత్సవం, 14వ తేదీ భోగి రోజున గోదా రంగనాయకుల కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులు విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం



చేదూరి రాంబాబు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరలిలా.. జ్ఞానాపురం రాసవీధిలో కుటుంబంతో కలిసి నివసిస్తున్న చేదూరి రాంబాబు తాపీమేస్త్రిగా పనిచేస్తుంటాడు. ఈ నెల 10న వ్యక్తిగత పనిమీద కాకినాడకు వెళ్లాడు. తిరిగి బంధువులు 11న ఉదయం విశాఖకు వచ్చేందుకు రాంబాబును బస్టాండ్‌కు సమీపంలో దింపేశారు. అనంతరం అతడు ఇంటికి వచ్చేస్తాడని బంధువులు ఫోన్ ద్వారా రాంబాబు భార్యకు తెలిపారు. రాత్రి అయినా రాకపోవడంతో అంతటా ఆరా తీశారు. తర్వాత ఫోన్ కూడా పనిచేయలేదు. దీంతో అతని భార్య చేదూరి విజయలక్ష్మి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎన్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ నరసింహ మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన వ్యక్తి ఐదు అడుగుల 9 అంగుళాల ఎత్తు, చామనఛాయ రంగులో ఉంటాడు. ఎవరికైనా కనిపిస్తే సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

అలరించిన డోజో మోజో నాటకం



డోజో మోజో నాటక ప్రదర్శన

బీచ్ రోడ్డు: రసజ్ఞ జాతీయ భాషా నాటకోత్సవాలలో భాగంగా పిఠాపురం కాలనీ కళాభారతిలో గురువారం ప్రదర్శించిన డోజో మోజో నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. విభిన్న మనస్తత్వాలు కలిగిన ముగ్గురు వ్యక్తుల కలలను కథా అంశంగా డోజో మోజో నాటిక సాగింది. ఎవరికి వారు తమ కలల్ని నిజం చేసుకోవడానికి ఇతరుల ప్రమేయం అవసరం లేదని అనుకునే ఈ ముగ్గురు వారికి తెలియకుండానే ఒకరికొకరు సహకారం చేసుకొని వారి కలల్ని నిజం చేసుకుంటారు. ఈ కథను ఎంతో రసవత్తరంగా ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. ఈ కథను మల్లేశ్వరరావు ఆకుల అనువాదం చేశారు.

మహిళలను గౌరవించాలి



మాట్లాడుతున్న సాంబశివరావు

బీచ్ రోడ్డు: ప్రతి ఒక్కరు మహిళలను గౌరవించాలని ప్రొఫెసర్ సాంబశివరావు అన్నారు. గురువారం కృష్ణా కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో పని చేసే చోట మహిళలపై అఘాయిత్యాలు అనే అంశంపై చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తీసుకోవలసిన జాగ్రత్తలు, సమాజంలో రావాల్సిన మార్పులపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఆర్.కుసుమకుమారి, కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌తోనే సుస్థిర పాలన

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- ఉత్సాహంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'



సంక్షేమ పథకాల కిట్లను అందిస్తున్న కె.కె.రాజు, వావిలపల్లి ప్రసాద్ తదితరులు



50వ వార్డు కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

మద్రిపాలెం: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. 50వ వార్డు 292 సచివాలయం పరిధిలో కార్పొరేటర్ వావిలపల్లి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి, విద్య, వైద్యం ఇలా ప్రజల అన్ని అవసరాలకు పెద్దపీట వేసి హామీలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. భవిష్యత్తు బాగుండాలంటే ముఖ్యమంత్రిగా ఆయనే మళ్లీ రావాలని ఆకాంక్షించారు. అనంతరం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల డిజిటల్ బోర్డును, పార్టీ జెండాను కె.కె.రాజు ఆవిష్కరించారు. సంక్షేమ పథకాల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టారు, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ ఎం.లక్ష్మి, 50వ వార్డు నాయకులు పి.సునీత, బగాది విజయ్ కుమార్, తిరుమలరావు, ఏవీఎస్ రాజు, నసపల నారాయణ స్వామి, పొన్నాడ అప్పారావు మాస్టారు, రత్నం, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45, 46 వార్డుల పరిధి కైలాసపురం సచివాలయం(255) పరిధిలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకుల ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియజేసే డిస్‌ప్లే బోర్డును వారు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వీరు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. అవి కొనసాగాలంటే మన నియోజకవర్గంలో కె.కె.రాజును ఎమ్మెల్యేగా గెలిపించుకుని, వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, కో ఆప్షన్ మెంబర్ సేనాపతి అప్పారావు, పార్టీ నాయకులు హరిపట్నాయక్, సీవో రమణి, ఏఈ ఉమామహేశ్వరరావు, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ కన్వీనర్లు రామారావు, బాబూరావు, పైడి నాగరాజు, దుర్గేష్, నాయుడు, కలిశెట్టి మహేష్, మాత ఈశ్వర్, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.



కైలాసపురంలో పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న కంపా హనోకు, కటుమూరి సతీష్

పోలీసుల అదుపులో నలుగురు వ్యక్తులు

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పూట బెదిరింపులకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండు రోజులుగా న్యూకాలనీ, తాటిచెట్లపాలెం, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో రాత్రి వేళ పాదాచారులు, వాహన చోదకులను చాకులతో బెదిరించి వారి వద్ద నుంచి నగదు వసూళ్లు చేస్తున్నారని సమాచారంతో పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

శాస్త్రోక్తంగా పగల్‌పత్తు ఉత్సవాలు



పారాయణాలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై పగల్‌పత్తు ఉత్సవాలు రెండో రోజు గురువారం శాస్త్రోక్తంగా కొనసాగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలోవేంజేపచేసి ఉదయం ఆలయ బేడా మండపంలో అయ్యవారి సేవను విశేషంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ ఆస్థాన మండపంలో వేంజేపచేశారు. దివ్యప్రబంధ పారాయణాలు పఠించారు. స్థానాచార్యుడు టి.పి.రాజగోపాల్, అధ్యాపకులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

పుస్తక పఠనంతో సృజనాత్మకత



విజేతలతో అతిథులు

విశాఖ సిటీ: పుస్తక పఠనంతో పిల్లల్లో విజ్ఞానం, సృజనాత్మకత పెంపొందుతాయని దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. టర్నర్‌చౌల్ట్రీలో జరుగుతున్న విశాలాంధ్ర బుక్ హౌస్ పుస్తక మహోత్సవంలో భాగంగా గురువారం వివిధ పాఠశాలల విద్యార్థులకు వీ డెంటల్ హాస్పిటల్ సౌజన్యంతో క్విజ్ పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, ద్వారకానగర్ రవీంద్ర భారతి స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. సీనియర్ విభాగంలో రవీంద్ర భారతి స్కూల్ ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, మధురానగర్ జీవీఎంసీ హై స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు ఈవో లక్ష్మీప్రసన్న బహుమతులతో పాటు సర్టిఫికెట్లు, వీ డెంటల్ హాస్పిటల్ ఫ్యామిలీ హెల్త్ కార్డ్, డెంటల్ కిట్లు అందజేశారు. క్విజ్ మాస్టర్లుగా ప్రసన్న కుమార్, నవ్య సిరికి, కె.పృథ్వీరాజ్ వ్యవహరించారు. వీ డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ పార్కులో విద్యుత్ వెలుగులు



పార్కులో ఏర్పాటు చేసిన లైట్

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వీధి లైట్లు ఏర్పాటు చేశారు. పార్కులో వెలగని దీపాల విషయమై జీవీఎంసీ విద్యుత్ శాఖ వీధిలైట్ల విభాగం అధికారులకు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలియజేశారు. దీనిపై అధికారులు స్పందించారు. పార్కులో వెలగని రెండు విద్యుత్ లైట్లను గురువారం ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ చీకట్లు తొలగడంతో పార్కు సందర్శకులు, వాకర్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను పరిష్కరించిన అధికారులకు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్నత లక్ష్యాలకు బాటలు వేసుకోండి



ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. పార్కులో వెలగని దీపాల విషయమై జీవీఎంసీ విద్యుత్ శాఖ వీధిలైట్ల విభాగం అధికారులకు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలియజేశారు. దీనిపై అధికారులు స్పందించారు. పార్కులో వెలగని రెండు విద్యుత్ లైట్లను గురువారం ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ చీకట్లు తొలగడంతో పార్కు సందర్శకులు, వాకర్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను పరిష్కరించిన అధికారులకు పల్లా చంద్రమౌళి కృతజ్ఞతలు తెలిపారు.

1036వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమ అమ్మకపు ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1036వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో బ్లాస్ట్ ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొన్నారు.